క్లుప్తంగా

తాత్కాలిక పార్థివ శివలింగం ప్రతిష్ట

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డులోని భగవాన్ శ్రీషిర్డీ సాయిబాబా మందిర ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన తాత్కాలిక పార్థివ శివలింగం సోమవారం ప్రతిష్ట చేశారు. గణపతి పూజ, పుణ్యవచనం, రుద్రాభిషేకం, బిల్వార్చన, మంత్రపుష్పములతో పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక్కడ త్వరలో శివాలయం నిర్మాణం చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి తెలిపారు. కార్యక్రమంలో పరిమి రామనరసింహశర్మ, హేమశివప్రసాద్, రామారావు, మంజులరాణి, కాకర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో దేవదాయ శాఖ కమిషనర్

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా కమిషనర్ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు కమిషనర్ సత్యనారాయణను శేషవస్త్రంతో సత్కరించి దేవస్థానం ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో ఈవో ఎం.గంగాధరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పాల్గొన్నారు.

7న మాదిగల సామాజిక న్యాయ మహాసభ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదిగ విద్యావంతులచే స్థాపించిన ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్(ఇన్ఫామ్) 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 7న తాడిగడపలోని అనుమోలు గార్డెన్స్‌లో 'మాదిగల సామాజిక న్యాయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఇన్ఫామ్ అంతర్జాతీయ అధ్యక్షుడు గెద్దం బాపిరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మహాసభకు హాజరవుతారన్నారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో జరిగిన ఇన్ఫామ్ సమావేశంలో మాదిగల సామాజిక న్యాయ మహాసభ వాల్ బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. సమావేశంలో ఇన్ఫామ్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి, ఇన్ఫామ్ సలహాదారు, ఇన్ఫామ్ సర్పంచుల కన్వీనర్ శీలం రంగారావు, అరుంధతి బంధుసేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాయిప్రసాద్, రాయలగోపి, ప్రజాప్రతినిధుల కన్వీనర్ బ్రహ్మయ్య, సెక్రటరీ శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలుగు శాసనాల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు శాసనాల పరిరక్షణ కోసం ప్రముఖ శాసన పరిశోధకులు, శాసన నిపుణులు, చరిత్ర కారులు, తెలుగు భాషాభిమానుల్లోని ఔత్సాహికులతో తొలి తెలుగు శాసన పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం గౌరవ అధ్యక్షుడు ఆచార్య పరిమి రామనరసింహం, వ్యవస్థాపకుడు పీవీఎల్ఎన్ రాజు సోమవారం తెలిపారు. స్థానిక మారుతీనగర్ తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తొలి తెలుగు శాసనాల పరిరక్షణ కమిటీ వివరాలు చెప్పారు. కార్యక్రమంలో తొలి తెలుగు దివ్వె అధ్యక్షుడు పిల్లి లక్ష్మీతులసి పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక

పాయకాపురం(విజయవాడరూరల్): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీలకు పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని భువనేశ్వరి ఎంపికైనట్టు హెచ్ఎం మైనం హుస్సేన్ తెలిపారు. ఆంధ్రలయోలా కాలేజీలో జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు జరగ్గా 9వ తరగతి చదువుతున్న తమ స్కూల్ విద్యార్థిని భువనేశ్వరి ఎంపికైందని ఆయన చెప్పారు. భువనేశ్వరిని హెచ్ఎం హుస్సేన్‌తో ఉపాధ్యాయులు శేఖర్, రాజ్యలక్ష్మి, సత్యవతి అభినందించారు.

58వ డివిజన్‌లో గ్రామసభ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన గ్రామసభ కార్యక్రమం 58వ డివిజన్‌లో సోమవారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ నందమూరినగర్‌లో గ్రామసభను నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బంగారు భవిష్యత్తు

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బంగారు భవిష్యత్తు ముడిపడి ఉందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ నందమూరినగర్‌లోని 240వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన సోమవారం పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక పాలనతో నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికీ కలిగిన లబ్ధిని వివరించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. 240వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 2,495 మందికి రూ. 8.67 కోట్లు లబ్ధి చేకూరినట్లు వెల్లడించారు. పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో సీఎం జగన్‌కి, చంద్రబాబుకి ఎక్కడా పోలిక లేదన్నారు. ప్రతి నెలా ఠంచనుగా ఒకటో తేదీన ఇచ్చే సామాజిక పింఛన్ల కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రముఖ సంస్థ స్కోచ్ ఈ ఏడాది ప్లాటినం అవార్డును ప్రకటించినట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో నిర్వహిస్తున్న మహిళా మార్టులకు గోల్డ్ అవార్డు, పొదుపు సంఘాల బలోపేతానికి జరుగుతున్న కార్యక్రమాలకు సిల్వర్ అవార్డును స్కోచ్ అందించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి వెంకట్రావు, రఫీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దేవీనగర్ 247వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 247వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 2,802 మందికి రూ. 9.27 కోట్లు డీబీటీ ద్వారా అలాగే నాన్ డీబీటీ ద్వారా 1,952 మందికి రూ. 8.61 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు మల్లాది విష్ణు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జీ కంభం కొండలరావు, నాయకులు తుంపాల వరప్రసాద్, మార్తి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం పనులు గడువులోగా పూర్తి చేయండి



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): బందరురోడ్డులోని స్వరాజ్‌మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు వేగవంతం చేయాలని, పనులు గడువులోగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించి, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్రలో భాగంగా బాల్యం నుంచి రాజ్యాంగం రాసేంత వరకు ముఖ్యమైన ఘట్టాలకు సంబంధించిన ఛాయ చిత్రాలను, వస్తువులను ప్రదర్శించేందుకు మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ పోరాట పటిమ, సేవలు భావితరాలకు ఎంతగానో స్ఫూర్తిదాయకమని ఆ నిర్మాణ పనుల్లో ఎటువంటి లోపం లేకుండా జరగాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సందర్శకులు సందర్శించే విధంగా 125 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతివనం అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ మేనేజర్ జావీద్, తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం నిర్మాణంపై ప్రజా సంఘాల హర్షం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం నిర్మించడం పట్ల ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి సోమవారం స్మృతివనాన్ని సందర్శించారు. ఈ నెల 26న జరిగే ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజా, దళిత, గిరిజన సంఘాలు, రాజకీయ పక్షాలను ఆహ్వానించాలని కోరారు. స్మృతివనం సందర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, బుట్టి రాయప్ప, వెంకట్రావు, ఈశ్వరరావు, కొండపల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆశించిన దాని కంటే సెంట్రల్ నియోజకవర్గం మెరుగైన ప్రగతిని సాధిస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ కండ్రిక జంక్షన్ వద్ద 15వ ఆర్థిక సంఘం ఎయిర్ పొల్యూషన్ గ్రాంటు రూ.9కోట్ల రూపాయలతో వాతావరణ పరిరక్షణకై ఇన్నర్ రింగ్ రోడ్డులో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రూ. 5కోట్లతో పైపులరోడ్డు జంక్షన్ నుంచి జక్కంపూడి జంక్షన్ వరకు 5.3 కి.మీ మేర బీటీ రోడ్డు, కండ్రిక జంక్షన్ నుంచి ముస్తాబాద్ జంక్షన్ వరకు 4.2 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే రూ. 2.50 కోట్ల నిధులతో చేపట్టిన విజయవాడ-నూజివీడు రహదారి నియోజకవర్గానికే మణిహారంగా మారిందని వెల్లడించారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత డివిజన్లో రూ. 12 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రధానంగా రోడ్లపై దృష్టి సారిస్తూ రహదారులను ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు రూ. 3.50 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కండ్రిక నుంచి పాతపాడు వరకు 3 కి.మీ మేర చేపట్టిన రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఈఈ (ఇంజనీరింగ్) శ్రీనివాస్, డీఈ గురునాథం, ఏఈ మాధవ్, నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఇస్మాయిల్, జిల్లేల శివ, పందిరి వాసు, అలంపూరు విజయ్, ఉమ్మడి వెంకట్రావ్, ఉద్దంటి సురేష్, నరసింహారావు, బోరా బుజ్జి, రామిరెడ్డి, జి.వెంకటేశ్వరమ్మ, టి.తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందించేందుకు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కమిటీ సభ్యులతో వర్చువల్‌గా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, విశ్వకర్మ యోజన, పోషన్ శక్తి నిర్మాన్ అభియాన్, జన్ ధన్ యోజన తదితర పథకాలను ప్రచారం కల్పించాలన్నారు. రోజుకు రెండు పంచాయితీల్లో ప్రచార వాహనంతో చిత్ర ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. నియోజకవర్గాల వారీగా గ్రామీణ, పట్టణ, ఏజెన్సీ ప్రాంతాల్లో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. యాత్ర జరిగే రోజుల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు జిల్లా స్థాయిలో డీపీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రచారానికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీపీవో జయచంద్ర గాంధీ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.నాగేశ్వరరావు, ఫిషరీస్ డీడీ నాగరాజా, అగ్రికల్చర్ జేడీ ఎస్.నాగమణమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా సీతారామపురం సబ్‌స్టేషన్, 11కేవీ గీతామందిరం, సత్యసాయి ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట రైవస్ కాలువగట్టు, సీతారామపురం కాలువగట్టు, లాల్‌బహదూర్‌శాస్త్రి వీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌రోడ్, కాకాని నగర్, గీతామందిర్‌రోడ్, మేదరబజారు, కోటిలింగాలవారివీధి, నెహ్రూస్ట్రీట్, చాపరాలవారి వీధి, ఐనవోలువారి వీధి, రామాకార్పొరేషన్ ఏరియా, శాతవాహన కాలేజీ వెనుకవైపు, ఐకాన్ పబ్లిక్‌స్కూల్ ఏరియా, మల్లెల శ్రీరామమూర్తి వీధి, కొల్లిపరవారి వీధి, వీరమాచినేనివారి వీధి, వారణాసివారి వీధి, ఏలూరురోడ్డు సీతారామపురం సిగ్నల్స్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

గాంధీనగర్‌లో...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్, ఎస్ఆర్‌రాజువీధి, పాపయ్య వీధి, జ్ఞానోలివ్‌వారివీధి, ఎన్ఆర్‌పీరోడ్, రైల్వేస్టేషన్‌రోడ్, ఆంధ్రరత్నరోడ్, రామారావుస్ట్రీట్, తాలూకా ఆఫీస్ ఏరియా, నన్రావారిస్ట్రీట్, ప్రెస్‌క్లబ్ ఏరియా, అలంకర్ సినిమాహాల్ ఏరియా, ఐలాపురంహోటల్ ఏరియాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ సుధాకర్ తెలిపారు.

మధురానగర్‌లో.....

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎప్పులమిల్లు, తుంగంరాజు వీధి, వెంకటేశ్వర నగర్, వీవీ నరసరాజురోడ్డు, రామకృష్ణాపురం ,కళ్ళేపల్లివారివీధి, కోడూరురాజువీధి, గొట్టుముక్కలవారివీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ సుధాకర్ తెలిపారు. అలాగే ముత్యాలంపాడు సెక్షన్, శ్రీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, శ్రీనగర్‌కాలనీ ఒకటో రోడ్డు నుంచి 5వ రోడ్డు వరకు, టీచర్స్‌కాలనీ ఒకటోరోడ్డు నుంచి మూడోరోడ్డు వరకు, భగత్‌సింగ్‌రోడ్డు, జెండాచెట్టు ఏరియా, కృష్ణా అపార్ట్‌మెంట్‌రోడ్డు, గంగానమ్మగుడి రోడ్డు, వానపాలవారివీధి, పెనుమత్సవారి వీధి, దేవాలయం వీధి, రామరాజువీధి, రామకృష్ణాపురం బుద్ధంరాజువీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ సుధాకర్ పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 43 మందికి జైలు,జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం సేవించి వాహనాలు నడిపే 43 మందికి జైలు, జరిమానా విధిస్తూ ఏడో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తులు సోమవారం తీర్పు వెల్లడించారు. వీరిలో ఒక వ్యక్తికి 19 రోజులు, రూ.10 వేలు జరిమానా, 18 మందికి 2 రోజుల నుంచి 15 రోజుల వరకు జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు. ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా, మిగిలిన 22 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు.

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించండి

- వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్
- స్పందనకు 30 అర్జీలు



స్పందనలో అర్జీని స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చిన స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో ఆయన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని, అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై - 15, యూసీడీ విభాగం - 6, ఇంజినీరింగ్ విభాగం - 5, రెవెన్యూ, హెల్త్, ఎలక్షన్, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్)విభాగంపై ఒక్కో ఫిర్యాది అందిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) రోహిణి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) కె.లత, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు

పోలీస్ స్పందనకు 91 అర్జీలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడటంతో పాటు దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి అర్జీలను స్వీకరించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ ఫిర్యాదుల్లో 24 నగదు లావాదేవీలకు సంబంధించినవి, 14 భార్యాభర్తలు, కుటుంబ కలహాలు, 21 సివిల్ వివాదాలు, వివిధ మోసాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు, 5 ఇంటి అద్దె, ఒక బైక్ దొంగతనం, ఇతర చిన్న చిన్న సమస్యలు మొత్తం 91 ఫిర్యాదులను డీసీపీ స్వీకరించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆర్థిక బలోపేతమే లక్ష్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 239వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజాతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి నుండి సలహాలు, అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ఎటువంటి వివక్ష లేకుండా అర్హులందరికీ జగనన్న ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోందని తెలిపారు. తెలుగుదేశం పాలనలో రోడ్ల మరమ్మతులకు ఖర్చు చేసింది కేవలం రూ. 2,953 కోట్లు కాగా తమ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లలో ఖర్చు చేసింది అక్షరాలా రూ. 4,148 కోట్లు అని మల్లాది విష్ణు వెల్లడించారు. కనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలు ప్రతిపక్షాలు మానుకోవాలని చెప్పారు. ప్రజావసరాలను గుర్తించి పరిష్కరించడంలో సీఎం జగన్ ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, కృష్ణమోహన్, వసంత్, శర్మ, తోపుల వరలక్ష్మి, శోభన్, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 31వ డివిజన్ 211వ వార్డు సచివాలయం అంబేడ్కర్ కాలనీలో జగనన్న సురక్ష శిబిరం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యంతో కలిసి ప్రారంభించారు. వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆరోగ్యకేంద్రం, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ ముగింపు వేడుకలు



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో జరిగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ పుస్తకాలకు మించిన మంచి నేస్తం విద్యార్థులకు మరొకటి ఉండదన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికేట్‌లు అందజేశారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి, శారద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి, గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం ఘనంగా జరిగింది. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రామకృష్ణాపురంలో...

రామకృష్ణాపురం శ్రీ కళ్ళేపల్లి శేషంరాజు స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హెచ్ఎస్‌వీ జానారెడ్డి ముఖ్య అతిథిగా సోమవారం పాల్గొన్నారు. కార్యక్రమాలను లైబ్రేరియన్ పర్యవేక్షించారు.

అమర గాయకులకు స్వర నీరాజానం

విజయవాడ కల్చరల్: చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో కార్తిక సోమవారం సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికలో నిర్వహించిన భక్తి సంగీతం, సినీ సంగీత విభావారి కార్యక్రమం సోమవారం మధురంగా సాగింది. మధుర గాయకులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, రామకృష్ణ ఆలపించిన గీతాలను దండు చంద్రశేఖర్, మల్లాదిస్వాతి, వెంకటేష్, శ్రావణి, బీహెచ్ కామేశ్వరి ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి రెయిన్ కోట్‌లు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పారిశుద్ధ్య సిబ్బందికి రెయిన్ కోట్‌లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పారిశుద్ధ్య సిబ్బందితో మమేకమై స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీ విధానం పరిశీలించారు. నాయకులు కొండాయగుంట రాము, విల్సన్‌రాజు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, సాయి, స్కూల్ హెచ్‌ఎం సూర్యప్రభ, సరోజని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



శివలింగం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



యనమలకుదురు ఆలయంలో నృత్య ప్రదర్శన చేసిన బాలికలతో అతిథులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం తొలి సోమవారం సందర్భంగా స్థానిక ముత్యాలంపాడు, అయోధ్యనగర్‌లలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో నిండిపోయాయి.

ముత్యాలంపాడులో....

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చనలు, పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు, కార్యదర్శి శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు, సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

అయోధ్యనగర్‌లో.......

అయోధ్యనగర్‌లోని శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠం భక్తులతో సోమవారం కిటకిటలాడింది. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంను అర్చకులు శేఖర్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అజిత్‌సింగ్‌నగర్‌లో...

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కార్తీక మాసం సందర్భంగా స్థానిక 57వ డివిజన్ అమరావతి కాలనీలోని క్షిప్ర గణపతి దేవస్థానంలో సహస్ర దీపాలంకార సేవ సోమవారం కన్నులపండువగా జరిగింది. దేవస్థాన కమిటీ పెద్దలు సుబ్రహ్మణ్యం, రంగా, రవికుమార్, మురళి పాల్గొన్నారు.

యనమలకుదురులో ఆలయంలో కార్తిక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం కార్తిక పూజలు నిర్వహించారు.స్వామివారికి ఏకరుద్రాభిషేకం, విశేష అలంకరణ, శాంతికల్యాణం చేశారు. రాత్రి కార్తిక దీపాలు వెలిగించారు. అనంతరం పటమటకు చెందిన హవీష్ చౌదరి కళాక్షేత్ర అకాడమీ చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా చేశారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ డైరెక్టర్ వీజీ రెడ్డి సతీమణి వీజీ బిందు పాల్గొన్నారు.

ఘనంగా మస్జిద్ ఎ కరీమున్నీసా మదరస్సా శంకుస్థాపన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): మాజీ ఎమ్మెల్సీ ఎండీ కరిమున్నీసా ద్వితీయ వర్ధంతి సందర్భంగా సింగ్‌నగర్ పైపులరోడ్డు సమీపంలోని అంబాపురం పంచాయతీ పరిధిలో మస్జిద్ ఎ కరిమున్నీసా, మదరస్సా శంకుస్థాపన పనులు ఘనంగా జరిగాయి. ముందుగా సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాలు కలిసి రిబ్బన్ కట్ చేశారు. అనంతరం ముస్లిం మత గురువులు ప్రత్యేక దువా చేయగా హాజి మొహమ్మద్ సలీమ్ కుటుంబ సభ్యులతో కలసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ కరీమున్నీసా వంటి మంచి వ్యక్తులు మన మధ్య భౌతికంగా లేకపోయినా, ఆమె చేసిన మంచి పనులతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. ఎన్టీఆర్ జిల్లా జామత్ అమిర్, సయ్యద్ అక్బర్ సాహెబ్, ముఫ్తీ హబీబ్ అహ్మద్ సాహెబ్, అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య, కోఆప్షన్ సభ్యులు ఎన్డీ అలీమ్, జిల్లాలోని ముస్లిం మత గురువులు, మైనారిటీ నాయకులు హాజరయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com